క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



గీసుకొండ : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు సెంటర్‌లో ప్రజల దాహార్తి తీర్చడానికి గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ–గీత దంపతులు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. స్థానికులు ఏనుగుల సాంబరెడ్డి, పొగాకు కిష్టయ్య, రమ, కత్తి హేమలత, వెంకన్న, ముల్క సత్య నారాయణ, కోట రజని పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


వెంకటేశ్వర్‌రావు

సంగెం : సంగెం నూతన ఎంపీడీఓగా వెంకటేశ్వర్ రావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. హనుమకొండ జిల్లా దామెర ఎంపీడీఓగా పనిచేస్తున్న వెంకటేశ్వర్‌రావు బదిలీపై సంగెం ఎంపీడీఓగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ మల్లేశం ఎక్సైజ్ శాఖ ఎస్సైగా వెళ్లడంతో ఎంపీఓ కొమురయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహించారు.

గ్రాడ్యుయేషన్ డే

నర్సంపేట : పట్టణంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనికిషన్, టౌన్ సీఐ పులి రమేష్‌లు హాజరయ్యారు. ఈ మేరకు సరస్వతీ దేవి చిత్ర పటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.పాఠశాల చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, డైరెక్టర్ ఎర్ర ఊర్మిళ, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల సభ



నల్లబెల్లి : రేషన్ డీలర్స్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో నేడు(మంగళవారం) హనుమకొండలో నిర్వహిస్తున్న సభకు రేషన్ డీలర్స్ కుటుంబ సభ్యులతో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి చెట్టుపల్లి లీలా దామోదర్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో తెలంగాణ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సమావేశంలో లీలా దామోదర్ మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సమస్యలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సమావేశంలో రేషన్ డీలర్లు భిక్షపతి, దేవేందర్, చంద్రచారి, బొమ్మకంటి రవి తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ దంపతుల చేయూత



గీసుకొండ : మండలంలోని ఊకల్ హవేలిలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మల్టీపర్పస్ వర్కర్లకు రూ.500 సొంతంగా అందిస్తామని సర్పంచ్ మొగసాని నాగదేవత–సంపత్ ప్రకటించారు. గ్రామంలో మొత్తం ఏడుగురు మల్టీపర్పస్ వర్కర్లు ఉండగా ఒక్కొక్కరికి నెలకు రూ. 8500 వేతనం వస్తుండగా అదనంగా రూ. 500 ఇస్తామని ప్రకటించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దంపతులు మల్టీపర్పస్ వర్కర్లను శాలువాలతో సన్మానించారు. ఎంపీటీసీ వీరారావు, ఉపసర్పంచ్ ముదుసు శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వేల్పుల సురేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

పాఠశాల భూమిని కాపాడాలి

నర్సంపేట రూరల్ : ప్రభుత్వ పాఠశాల భూమిని కాపాడాలని ఏబీఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, ప్రసాద్, రాజేందర్, మురళీ, వంశీ, రవీందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం



చెన్నారావుపేట : గ్రామాభివృద్ధే లక్ష్యంగా స్వచ్ఛ భారత్ ఫేస్–2లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను వినియోగించుకోవాలని ఎంపీపీల ఫోరం జిల్లా అధ్యక్షుడు బాదావత్ విజేందర్, ఏపీడీ సాయి చరణ్ అన్నారు. ఈ మేరకు ఐకేపీ కార్యక్రమంలో శిక్షణ తరగతులను వారు సోమవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడారు. శిక్షణలో మాస్టర్ ట్రెయినర్లు శ్రీనివాస్‌రావు, సురేష్, రాజు, శ్రీధర్, శ్రీనివాస్‌లు, ఎంపీడీఓ భారతి, ఎంపీఓ శ్రీధర్ రాజు, ఈసీ కిషోర్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ సీసీలు పాల్గొన్నారు.

దర్జాగా మొరం దందా

- మధ్యాహ్నం ట్రాక్టర్లు సీజ్.. సాయంత్రం మళ్లీ షురూ..
- పోలీస్, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే మొరం తవ్వకాలు


క్వారీ నుంచి పొక్లెయినర్‌ను బయటకు తీసుకురావాలని కోరుతున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

నర్సంపేట రూరల్ : వడ్డించే వాడు మనవాడైతే అన్న చందంగా ఉంది.. పోలీస్, రెవెన్యూ పనితీరు. సెలవు రోజు వచ్చిందంటే చాలు ఏజెన్సీ గ్రామంలోని ప్రభుత్వ భూముల్లో ఇష్టారాజ్యంగా మొరం దందా కొనసాగుతోంది. ఇక అధికార పార్టీ నాయకులైతే ఎలాంటి అనుమతులు అవసరం లేదా.. అని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నా.. పోలీసులు, రెవెన్యూ అధికారులు సైతం వాళ్లకే వత్తాసు పలుకుతున్నారు. తూతూ మంత్రంగా రెండు, మూడు ట్రాక్టర్లు సీజ్ చేసి జరిమానా విధిస్తున్నారే తప్పా వారిపై కనీస చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మధ్యాహ్నం సీజ్ అవుతునప్పటికీ.. సాయంత్రం వరకే మళ్లీ మొరం దందా జోరుగా సాగిస్తున్నారు. నర్సంపేటకు కూత వేటు దూరంలో ఉంది రాజుపేట ఏజెన్సీ. ఇక్కడి అసైన్డ్ భూముల్లో 116, 117 సర్వేనంబర్‌లో వ్యవసాయం చేసుకునేందుకు అధికారులు కేటాయించారు. ఇదే అదునుగా భావించి కొందరు మొరం దందా వ్యాపారులు అందిన కాడికి భూమిని కొనుగోలుచేసి మొరాన్ని ఒక్కొక్క ట్రిప్పుకు రూ.1,000 నుంచి రూ.1,500 చొప్పున అమ్మకాలు చేస్తూ కాసులు సంపాదించుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులైతే చాలు స్థానిక ఎమ్మెల్యే, కింది స్థాయి అధికారులతో రెవెన్యూ, పోలీసుల అధికారులకు చెప్పించి ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మొరం దందా జోరుగా సాగిస్తున్నారు. ఇటీవల రంజాన్ పండుగా కావడంతో మొరం దందా సాగుతుందని, రెవెన్యూ, పోలీసులు అధికారులకు సమాచారం అందించడంతో వీఆర్‌ఏ, ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించారు. వీరు రెండు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను సీజ్ చేశారు. మొరం క్వారీ నుంచి పాకాల రోడ్డుకు చేరుకునే సరికే పొక్లెయినర్, ట్రాక్టర్ పంచార్ అయిందని చెప్పి తప్పించారు. దీంతో పోలీసులు అక్కడే జేసీబీని వదిలివేసి రెండు ట్రాక్టర్లను తీసుకోచి పోలీస్ స్టేషన్‌కు మధ్యాహ్నం వరకు తరలించారు. మళ్లీ సాయంత్రం 5గంటలకే మళ్లీ యథేచ్ఛగా మొరం దందాను సాగిస్తున్నారు. దీంతో స్థానికులు, రైతులు పోలీసులు, రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే దందా సాగుతుందని, సామాన్యులపైనే వీరి ప్రతాపం చూపిస్తారు కానీ, అధికార పార్టీ నాయకులపై కాదంటూ బాహాటంగానే విమర్శిస్తున్నారు.

జరిమానా విధించాం..

రెండురోజుల క్రితం మొరం అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి ఆఫీస్ తరలించాం. సోమవారం ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 2వేల చొప్పున జరిమానా విధించాం. ఎవరైనా అనుమతి లేకుండా మొరం దందా కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

\- రాంమూర్తి, తహసీల్దార్

విద్యాప్రగతిలో పీటీఎంలు కీలకం


గీసుకొండ: ప్రగతి నివేదిక అందజేస్తున్న ఎంఈఓ

గీసుకొండ : విద్యా ప్రగతిలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్(పీటీఎం)ల పాత్ర కీలకమని ఎంఈఓ చదువుల సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మారం, జాన్‌పాక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ముగింపు సందర్భంగా నిర్వహించిన పీటీఎంల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం రానుందన్నారు. పిల్లల తల్లిదండ్రులు వారి విద్యాభివృద్ధిలో తగిన పాత్ర పోషించాలన్నారు. కాంప్లెక్స్ హెచ్‌ఎం తీగల సుజాత, హెచ్‌ఎం సరళ, కోఆప్షన్ సభ్యుడు శ్రీకాంత్, ఎస్‌ఎంసీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్న..

దుగ్గొండి : ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఎంబీబీఎస్ సాధించి డాక్టర్ అయ్యానని మందపల్లి సబ్ సెంటర్ వైద్యాధికారి వనమాల అన్నారు. మండలంలోని మందపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీచర్స్, పేరెంట్స్, స్టూడెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలలో అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కర్ణకంటి రామ్మూర్తి, విద్యాకమిటీ చైర్మన్ ఏసీక నిరోష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శంగా తీర్చిదిద్దాలి


కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

నల్లబెల్లి : పంచాయతీ రాజ్ సంస్థల ఉద్యోగులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఎంపీపీ ఊడుగుల సునీత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులతో కలిసి ఎంపీపీ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాన బోయిన రాజారాం, ఎంపీఓ కూచన ప్రకాశ్, అబిద్ అలీ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాళ్లవానతో రైతుకు తీరని నష్టం


చెన్నారావుపేట: పొలంలో రాలిన వరి గింజలు


నల్లబెల్లి శివారులో నేలరాలిన మామిడి కాయలు

ఖానాపురం : అకాల వర్షాలు, రాళ్లవానతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతోందని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అన్నారు. వడగళ్ల వర్షాలతో నష్టపోయిన వరి పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. వడగళ్ల వర్షాలతో మిగిలిన వరిపంటలు సైతం కిందపడి ధాన్యం రాలిపోయిందన్నారు.

కూలిన ఇళ్లు

ఖానాపురం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో పాటు చెట్లు కూలిపోయాయి. మండల వ్యాప్తంగా 44ఇళ్లు కూలిపోవడంతో కేవలం ధర్మరావుపేట గ్రామంలోనే 32, కొత్తిమాటుతండా–3, వేపచెట్టుతండా–3, మంగళవారిపేట–1, నాజీతండా–3, మనుబోతుల గడ్డ–2 ఇళ్లు నేలమట్టమైనట్లు ఆర్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ఆర్‌ఐతో పాటు రెవెన్యూ సిబ్బంది పరిశీలించి వివరాలు సేకరించారు.

నేలరాలిన మామిడి కాయలు

నల్లబెల్లి : మండలంలో ఆదివారం వీచిన ఈదురు గాలులతో వడగళ్ల వాన కురిసింది. మండల కేంద్రానికి చెందిన గొట్టిముక్కల నాగభూషణం రైతుకు చెందిన రెండు ఎకరాల మామిడి తోటలో 50 శాతం వరకు కాయాలు రాలగా.. గద్దె సారయ్యకు చెందిన 5ఎకరాల మామిడితోటలో 50 శాతం పంట నేల రాలింది.


ఖానాపురం: వరిని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పర్వతగిరిలో..

వరంగల్(పర్వతగిరి) : మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షాలతో మొక్కజొన్న, వరి నేలవాలగా అత్యధికంగా మామిడితోటల్లోని కాయలు రాలిపోయాయి. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.

చెన్నారావుపేట : అకాల వర్షంతో చేతికొచ్చిన వరి, మొక్కజొన్న, మిర్చి దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ స్తంభాలు సరిచేసి సోమవారం సాయంత్రం కరెంట్ సరఫరా పునరుద్ధరించారు. అలాగే అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కోరె రమేష్ 4ఎకరాలలో వరి సాగు చేయగా 70 శాతం వరి గింజలు రాలాయి. జోజిపేట నారాయణ తండాకు చెందిన అలువాల ఆనందం ఇంటిపై చెట్టుపడి ఇంటి రేకులు పగిలిపోయాయి. ప్రభుత్వం సర్వే చేపట్టి ఆదుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి


మాట్లాడుతున్న నరుకుడు వెంకటయ్య

వర్ధన్నపేట : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటయ్య హాజరై మాట్లాడుతూ.. తొమ్మిది ఏళ్లుగా రేవంత్‌రెడ్డిపై దాదాపుగా 150 కేసులు రాష్ట్ర, కేంద్రం ప్రభుత్వాలు నమోదు చేసినప్పటికీ ధైర్యం కోల్పోకుండా రేవంత్‌రెడ్డి ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. రేవంత్‌రెడ్డికి వస్తున్న ప్రజాధారణను చూడలేక తప్పుడు ఆరోపణలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. 2023లో కాంగ్రెస్ పార్టీ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వస్తుందన్నారు. ఈటలకు బీజేపీలో ఆదరణ కరువైందని ఆయన తప్పుడు ఆరోపణలను బట్టి తెలుస్తుందన్నారు. రాజేందర్ తక్షణమే బేషరతుగా రేవంత్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు గుజ్జ రవీందర్ రెడ్డి,పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎర్ర శ్రీకాంత్, బంగారు సదానందం, వడ్లకొండ ఎల్లాగౌడ్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో 2020–21 పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకొని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సమ్మేళనంలో గురువులను సన్మానించారు.

పుస్తకాల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లి హైస్కూల్‌లో ఉచిత పోటీ పరీక్షల పుస్తకాలను బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సభ్యులు పిన్నింటి బాలాజీరావు, వ్యవస్థాపకుడు పులి దేవేందర్, హెచ్‌ఎం ఫ్లోరెన్స్ మాట్లాడారు.


పరామర్శ

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు అమ్మ కుమారస్వామి తండ్రి కొమురయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి మదన్‌మోహన్‌రావు సోమవారం పరామర్శించి, ఓదార్చారు.

పోరాట ఫలితమే పనులు

చెన్నారావుపేట : కాంగ్రెస్ పార్టీ పోరాట ఫలితంగానే రోడ్ల మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ అన్నారు.

ఎల్‌ఐసీలో పెట్టుబడి సురక్షితం


సమావేశంలో మాట్లాడుతున్న థామస్

గీసుకొండ: ఎల్‌ఐసీలో పెట్టిన పెట్టుబడి సురక్షితంగా ఉంటుందని ఎల్‌ఐసీ సీనియర్ డివిజన్ మేనేజర్ థామస్ అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ రెడ్డిపాలెం శివారులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎల్‌ఐసీ వరంగల్–2 బ్రాంచి నుంచి అమెరికాలో జరగబోయే మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్ (ఎండీఆర్‌టీ) సమావేశంలో పాల్గొనడానికి ఎంపికైన వారితో పాటు కొత్తగా క్లబ్‌కు అర్హత సాధించిన ఏజెంట్లను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో థామస్ మాట్లాడుతూ గత ఏడాది రౌండ్‌టేబుల్ సమావేశాలకు వరంగల్ డిస్ట్రిక్ట్ బ్రాంచి నుంచి 17 మంది ఏజంట్లు పాల్గొడానికి అర్హత సాధించడం విశేషమన్నారు. అనంతరం థామస్‌ను ఏజంట్లు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయ మార్కెటింగ్ మేనేజర్ చిరంజీవి, వరంగల్–2 సీనియర్ బ్రాంచి మేనేజర్ రాంజీ, అసిస్టెంట్ మేనేజర్ సుధాకర్, లీయాఫీ వరంగల్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణారావు, వరంగల్–2 బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, అశోక్, కోశాధికారి శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోకపోతే ఉసురు తగులుతుంది

కమలాపూర్: సీఎం కేసీఆర్.. పంజాబ్, హరియాణా, మహారాష్ట్ర రైతులను కాదు, ఓట్లేసి గెలిపించిన తెలంగాణ రైతులను కూడా ఆదుకోవాలని, లేదంటే వారి ఉసురు తగులుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. కమలాపూర్, అంబాల, శ్రీరాములపల్లి, గూనిపర్తి, పెర్కపల్లి, నేరెళ్ల, గూడూరు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి అకాల వర్షాలకు దెబ్బతిన్న మామిడి తోటలు, మొక్కజొన్న, వరి పంటలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం, ధ్వంసమైన ఇళ్లు, దళిత బంధు షెడ్లను సందర్శించి బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కమలాపూర్ మార్కెట్ యార్డులో మీడియాతో మాట్లాడారు. వరి కోతలు పూర్తవుతున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. వడగళ్లతో నష్టపోయిన మామిడికి ఎకరాకు రూ.లక్ష, మొక్కజొన్న పంట ఎకరాకు రూ.40వేలు, వరి ఎకరాకు రూ.30వేలు చొప్పున పంట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్లీనరీ సమావేశ ఏర్పాట్ల పరిశీలన


ప్లీనరీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది


రాయపర్తి: మాట్లాడుతున్న జెడ్పీటీసీ కుమార్

నర్సంపేట : నర్సంపేట వ్యవసాయ మార్కెట్‌లో నేడు(మంగళవారం) నిర్వహించనున్న ప్లీనరీ సమావేశ ఏర్పాట్లను ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 8గంటలకే గ్రామ పార్టీ ఆధ్వర్యంలో గులాబీ జెండాను ఎగురవేసి నిర్ణీత సమయంలో సభ ప్రాంగణానికి చేరుకోవాలని పార్టీ శ్రేణులను కోరారు. పార్టీ ముఖ్య నాయకులు, క్రియాశీల సభ్యులచే నిర్వహించనున్న ప్లీనరీకి పార్టీ అందించిన ఐడీ కార్డ్(ఎంట్రీ పాస్)లను తప్పకుండా ధరించి రావాలన్నారు. ఐడీకార్డు లేనిది సభా ప్రాంగణంలోకి అనుమతి లేదని తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సెషన్స్‌గా జరుగనున్న సమావేశంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ, కార్యకర్తలకు భరోసా లాంటి అనేక అంశాలపై పార్టీ నాయకులు 15తీర్మానాలను ప్రవేశపెట్టనున్నారని చెప్పారు. పార్టీ శ్రేణులు సాయంత్రం వరకు క్రమశిక్షణతో ఉండి నియోజకవర్గ ప్లీనరీని విజయవంతం చేయాలని కోరారు.

బీఆర్‌ఎస్ ప్లీనరీకి తరలిరండి

రాయపర్తి : బీఆర్‌ఎస్ ప్లీనరీకి పార్టీ ముఖ్య శ్రేణులు తరలిరావాలని జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. సోమవారం మైలారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, బీఆర్‌ఎస్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి గుడెల్లి వెంకన్న, లేతాకుల మాధవరెడ్డి, రవీందర్ రెడ్డి, సంకినేని ఎల్లస్వామి, గుడెల్లి వెంకటయ్య పాల్గొన్నారు.

రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం


సంగెం: చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

సంగెం : రైతులకు అండగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి అన్నారు. గతేడాది కురిసిన వర్షానికి పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుండేటి బాబు, కావటి వెంకటయ్య, ఎంపీటీసీ మెట్టుపల్లి మల్లయ్య, మండల వ్యవసాయాధికారి యాకయ్య, ఏఈఓలు సమత, గీత, భారతి, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల ఘనత బీఆర్‌ఎస్‌దే

రాయపర్తి : సీఎం కేసీఆర్ హయాంలో ఇంటింటా సంక్షేమ పథకాలు అందుతున్నాయి.. ఈ ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఊకల్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంత్రి దయాకర్‌రావు సహకారంతో మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రైతుబంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు, సర్పంచ్‌లు చిన్నల రాజబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుందూరు యాదగిరి రెడ్డి, బీఆర్‌ఎస్వీ మండల అధ్యక్షుడు సత్తూరి నాగరాజు, పార్టీ ముఖ్య నాయకులు భాషబోయిన సుధాకర్, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


రాయపర్తి : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడుతున్న అనిల్‌కుమార్

వర్ధన్నపేట : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు కుందూరు మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సెంటర్లను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోకుండా బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనాల పేరిట భారీ బహిరంగ సభలు ఏర్పాటు చేసి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను పరామర్శించకుండా పక్క రాష్ట్రాలకు వెళ్లి బహిరంగ సభలు సీఎం కేసీఆర్ పెడుతున్నారని విమర్శించారు. మొక్కజొన్న ధరలు బహిరంగ మార్కెట్‌లో పడిపోతున్నందున ప్రభుత్వం వెంటనే మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం తగదు

రాయపర్తి : గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటా పెట్టకపోవడం తగదని బీజేపీ జిల్లా నాయకుడు రావు అనిల్ కుమార్ విమర్శించారు. సోమవారం పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. రైతులు వరి పంటలు కోసి నెలన్నర కావొస్తున్నా ఇంతవరకు కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభించకపోవడం వల్ల ప్రకృతి వైపరీత్యాల తాకిడి భయం రైతుల్లో నెలకొందన్నారు.ఇప్పటికైనా స్పందించి వెంటనే కొనుగోలు చేపట్టకుంటే రైతుల పక్షాన ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంధ్య, చిట్టి మైబు, భిక్షపతి, ఆర్య రమేష్ పాల్గొన్నారు.

చెన్నారావుపేట : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎంసీపీఐ(యు) మండల నాయకుడు జన్ను రమేష్ అన్నారు. తహసీల్దార్ బన్సిలాల్‌కు సోమవారం వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆదివారం సాయంత్రం కురిసిన వడగళ్ల వానకు మామిడి, వరి, మొక్కజొన్న, మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మొర్రి శ్రీను, మొగిళి వెంకట్‌రెడ్డి, ఆనందం, రాజిరెడ్డి, అచ్చనాయక్, సాంబయ్యలు ఉన్నారు.

కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం

నర్సంపేట: మే డే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఉద్యోగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు హమాలీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి లక్ష్మినారాయణ అధ్యక్షతన సోమవారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడుతూ ఎన్నో త్యాగాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఉపయోగపడే విధంగా మార్పులు చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్‌ఐసీ, బ్యాంకు, బీఎస్‌ఎన్‌ఎల్, రైల్వే, పోస్టల్, బీహెచ్‌ఈఎల్, సింగరేణి లాంటి లాభాలు అందిస్తున్న రంగాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో అప్పనంగా పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ సీనియర్ నాయకులు గుండెబోయిన కొమురయ్య, ఆశల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బోలె రజిత, వీఓఏ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలదాసరి రమేష్, గ్రామపంచాయతీ యూనియన్ అధ్యక్షుడు జన్ను శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షుడు మాదాసి నర్సింగరావు, దడువాయి అధ్యక్షుడు గణిపాక సంజీవ, హమాలీ అధ్యక్షుడు బొల్లం ప్రసాద్, బోడ దేవా, గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు పెరుమాండ్ల రవి, ప్రేమలత, కరుణ, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

నివాళి


నివాళులర్పిస్తున్న బాధ్యులు

నర్సంపేట : తెలంగాణ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన మహిళా నేతల్లో మద్దికాయల లక్ష్మక్క ఒకరని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలు వంగల రాగసుధ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని మార్క్స్ కాలనీలో సోమవారం లక్ష్మక్క వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కష్టజీవుల పక్షపాతి ఆగయ్య

గీసుకొండ : సమాజంలో సంపద అందరికీ దక్కాలని, కష్టజీవుల పక్షాన పోరాడిన అమరజీవి పోగుల ఆగయ్య అని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. సోమవారం ఎంసీపీఐ(యు) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి దివంగత పోగుల ఆగయ్య వర్ధంతి సందర్భంగా స్వగ్రామం బొడ్డుచింతలపెల్లిలోని ఆయన స్మారక స్థూపం వద్ద నాయకులతో కలిసి నివాళులర్పించి మాట్లాడారు. ఆగయ్య ఆశయ సాధనలో ప్రతీ కమ్యూనిస్టు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.